## క్లుప్తంగా

### నియామకం

మొయినాబాద్: బీజేపీ మండల కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా అప్పోజీగూడ గ్రామానికి చెందిన పుల్ల కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ ఆధ్వర్యంలో నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహ్మారెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు, నాయకులు మాధవరెడ్డి, వీరేశం, జగపతి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా ఉదయ్

కేశంపేట: బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కానం ఉదయ్‌కుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదేశ్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్‌గౌడ్‌కు సోమవారం నియామక పత్రం అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

### వృద్ధులు ఇంటివద్దనే ఓటువేసే సౌకర్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేశ్‌కుమార్

కొందుర్గు: పోలింగ్ కేంద్రం వద్దకు నడవలేని వృద్ధులు ఇంటి వద్దనే ఓటువేసే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ రమేశ్ కుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులను పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించాలని, వారి ఇళ్ల వద్దకు పోలింగ్ అధికారులు వెళ్లి ఓటు వేయిస్తారని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రం వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో సెక్టర్ ఆఫీసర్ ప్రవీన్‌కుమార్, సుజాత, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ఆర్డీఓ వెంకట మాధవరావు



మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవరావు

కేశంపేట: పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, మంచినీటి వసతి, వెలుతురు లాంటి మౌళిక వసతులు కల్పించాలని ఆర్డీఓ వెంకట మాధవరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో తహసీల్దార్ అజీం అలీ సెక్టోరల్ అధికారులు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకట మాధవరావు మాట్లాడుతూ.. ఓటర్ స్లిప్పులను అందరికీ అందించాలన్నారు. చనిపోయిన వ్యక్తులు, మార్పులు ఉన్న ఓటర్ల స్లిపులను తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఎన్నికల రోజు బీఎల్‌ఓలు, పోలింగ్ ఏజెంట్లు రాజకీయ నాయకులతో సఖ్యతగా ఉండొద్దన్నారు. సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

చేవెళ్ల: మండలంలోని అల్లవాడ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీజేపీ నాయకులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, శర్వలింగం, ఆంజనేయులుగౌడ్, కృష్ణ, భీమ్‌రెడ్డి, గణేశ్, సందీప్, శంకరాచారి, నాగరాజు ఉన్నారు.

**జన్వాడలో బొడ్రాయి ఉత్సవాలు**

శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో సోమవారం శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా బొడ్రాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ఘనంగా బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులు, పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుక్కలు 'భౌ'బోయ్

- రాత్రిళ్లు రోడ్లపైకి రావడానికి జంకుతున్న ప్రజలు
- మనుషులు, జంతువులపై దాడి
- ఆగ్రహిస్తున్న మండలవాసులు
- పట్టించుకోని అధికారులు



షాబాద్‌లో వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

షాబాద్: వీధికుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. వీటి బారినపడిన వందలాది మంది ఆసుపత్రుల పాలవుతున్నా నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కనిపించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల బెడదతో జనాలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. నియంత్రణ లేక మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీల్లో కుక్కల బెడద తప్పడం లేదు. మండలంలోని నాగరగూడ, పోతుగల్, తాళ్ళపల్లి, రుద్రారం, హైతాబాద్, షాబాద్, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానికులను గాయపరుస్తున్నాయి. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తరచూ ఘటనలు**

మండలంలో తరచూ వీధికుక్కల దాడులు జరుగుతున్నాయి. ఇటీవల నాగరగూడ, తాళ్ళపల్లి, షాబాద్, పోతుగల్ గ్రామాల్లో 5 మందిపై కుక్కలు తీవ్రంగా దాడి చేశాయి. అదేవిధంగా గత నెలలో ఓ రెండేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రేగడిదోస్వాడ, తిమ్మారెడ్డిగూడ, చందనవెల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలపై దాడి చేయడంతో అవి మృతి చెందాయి. అలాగే పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి వెళ్లే వాహనదారులను వెంబడించడంతో కిందపడి గాయాలపాలయ్యారు. వీధికుక్కలు ప్రజలతో పాటు మేకలు, గొర్రెలు, గేదెలపై సైతం దాడులు చేస్తున్నాయి. దీంతో కొన్నిసార్లు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి.

**చీకటిపడితే అంతే సంగతులు..**

ఆలస్యంగా పనులు ముగించుకొని అర్ధరాత్రి నివాసాలకు వచ్చే వారిపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. రాత్రిపూట వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించడంతో వారు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు, వాకింగ్ చేసే వారితో పాటు పనుల కోసం బయటకు వెళ్లే వారిపై సైతం వీధి కుక్కలు గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే గతంలో ఇలాంటి సంఘటనలు జరిగాయి.

**పట్టించుకోని యంత్రాంగం..**

వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం వాటిని నియంత్రించడంలో విఫలమవుతోంది. మండలంలో కుక్కలు పట్టుకెళ్లే సిబ్బంది కొరతను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

**ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు**



నాగరగూడ, పోతుగల్ మధ్యన నిత్యం శునకాలు రెచ్చిపోతూ ప్రజలపై దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కుక్కల నివారణకు పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

–ముక్తర్, నాగర్‌గూడ, షాబాద్

**చర్యలు తీసుకుంటాం**



కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామాలు, మండల కేంద్రాల్లో తిరిగే కుక్కలను గుర్తించి పట్టుకుంటాం. శాస్త్రీయంగా కుక్కల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

–హన్మంత్‌రెడ్డి, ఎంపీఓ, షాబాద్

## అక్రమ నిర్మాణాలను నిలిపివేయండి



ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

షాబాద్: కుల సంఘాల పేరుతో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని దివ్యాంగులు పంతులు ప్రభాకర్, అల్లవాడ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చందనవెల్లి ప్రభుత్వ భూమిలోని సర్వే నెంబర్ 363లో దివ్యాంగుల ఇంటి ఎదుట అక్రమంగా చేపడుతున్న కుల సంఘాల భవనాల నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల ఇంటి ఎదుట ముదిరాజ్ సంఘం భవనం అక్రమంగా నిర్మిస్తున్నారని, దీనికి తోడు మిగతా కుల సంఘాలకు అక్రమంగా శంకుస్థాపనలు చేస్తున్నారని అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు రాధాకిషన్, మల్లేశ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మే 5న నిర్వహించే మహనీయుల జయంతి జాతర కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం సాయంత్రం పట్టణ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద యువజన సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామంలో జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్యక్రమంలో కృష్ణ, దొడ్డి శ్రీనివాస్, భీమసేన, గూడెం చెన్నయ్య, పోతుల సురేశ్, రమేశ్, శ్రీను, జంగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లిలో..



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో మాజీ మంత్రి ఇంద్రారెడ్డి వర్ధంతిని సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల నాయకుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ముద్దుబిడ్డ, పేదల పెన్నిధి మాజీ మంత్రి ఇంద్రారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, సుదర్శన్‌రెడ్డి, రాములు, నర్సింలుగౌడ్, యాదయ్యగౌడ్, రాజు, మోహన్‌రెడ్డి, ఎండీ నయీం, జిలానీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

చేవెళ్ల: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివేకానంద ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థులు అన్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం దేవునిఎర్రవల్లి సమీపంలో ఉన్న వివేకానంద ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలకు తగిన జాగ్రత్తలు, పలు సూచనలను అందించారు. పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానం, రియల్ వ్యాపారాలు, కంపెనీలు, అనేక కష్టాలతో రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారన్నారు. రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. రైతు లేకపోతే ఈ సమాజానికి తిండి ఉండదన్నారు. మండే ఎండలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఎక్కువగా నీరు తాగాలని చెప్పారు. అవసరమైతే తప్పా ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగొద్దని సూచించారు. వేసవి సెలవులు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల దిశా నిర్దేశకుడు హరి, వైస్ ప్రిన్సిపాల్ వేణుకుమార్, మేనేజర్ నరేశ్, అధ్యాపకులు వేణుగోపాల్, వెంకట్, ఋషి, నూర్జాహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

నందిగామ: గౌడ కులస్తుల ఆరాధ్యదైవం ఈదుల రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మండల పరిధిలోని నర్సప్పగూడలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని ఈత వనంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ కులస్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కులపెద్దలు మాట్లాడుతూ.. గౌడ కులస్తుల ప్రధాన వృత్తి కల్లు గీయడమని, ప్రతి నిత్యం ఈత వనంలోనే ఉంటుండంతో అక్కడ ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించుకొని పూజలు చేయడం అనవాయితీగా వస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని ఈత వనంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కలమ్మ, గౌడ సంఘం నాయకులు నారాయణ, సుదర్శన్, శివ కుమార్, లక్ష్మన్, నర్సింహా, కృష్ణయ్య, శ్రీధర్, యాదయ్య, ఈశ్వరయ్య, వెంకట్, విజయ్, వెంకటేశ్, రాజు, రాములు, జగన్, నందమయ్య, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ఫేర్‌వెల్ పార్టీలో విద్యార్థులతో అధ్యాపకులు

చేవెళ్ల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి మంచి భవిష్యత్ పొందాలని ప్రముఖ వక్త డాక్టర్ భాస్కరయోగి అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సోమవారం ఫైనలియర్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరయోగి మాట్లాడుతూ.. కళాశాల విద్య అనేది విద్యార్థుల భవిష్యత్‌కు దారి చూపించేదని తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ఎంచుకునే మార్గాలు, నిర్ణయించుకునే లక్ష్యాలే వారి బంగారు భవిష్యత్‌కు మార్గాలుగా మారుతాయన్నారు. అనంతరం విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయం

**టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి**

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేస్తే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్‌మర్రి, బోడంపహాడ్, అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిరెడ్డిగూడ గ్రామాల్లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావడానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్ బాగుంటుందని, పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని గుర్తుచేశారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ఆరు హామీలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భర్గవ్‌రామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డిలు మాట్లాడుతూ...ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమలో ఏ బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, ఎంపీటీసీలు గుండాల అశోక్, కుమ్మరి చెన్నయ్య, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు అశ్విని, పార్టీ సీనియర్ నాయకుడు మంగలి చెన్నయ్య, పామెన నర్సింలు, రవీందర్, చిన్నయ్య, నవీన్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, సత్తయ్య, శ్రీరాంరెడ్డి, అబేద్, కృష్ణ, బందయ్య, వేణు, భీమయ్య, బాలకృష్ణయ్య, రమేశ్, రాంచంద్రయ్య, రాజు, అంజయ్య, సువర్ణ, జ్యోతి, వరలక్ష్మి తదితరులున్నారు.



బోడంపహాడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సురేందర్‌రెడ్డి, తదితరులు

## నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా**

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం బీజేపీ నేతలు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బూత్ అధ్యక్షులు ఆనంద్, సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కక్కునూరి వెంకటేశ్ గుప్తా మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేశారన్నారు. కరోనా ఏర్పడినప్పటి నుంచి దేశంలో ఉన్న పేదలందరికీ కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వెంకటేశ్‌గుప్తా

దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీకి అండగా నిలవాలన్నారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోగుల నర్సింలు, నారని శ్రావణ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



అమ్డాపూర్‌లో ఇంటింటి ప్రచారంలో మాట్లాడుతున్న గౌరీ సతీశ్, తదితరులు

**టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్**

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డిలు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో సోమవారం ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. అమ్డాపూర్ మాజీ సర్పంచ్ రవళి గోపికృష్ణరెడ్డితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో నిరుపేదల బతుకుల్లో మార్పు రాలేదన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎంపీ రంజిత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిపించుకొని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేద్దామన్నారు. గ్రామాల్లో ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీల మాయమాటలు నమ్మే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు, మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, జిల్లా మత్స్య కార్మిక సంఘం చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, కొత్త జైపాల్‌రెడ్డి, నాయకులు కంజర్ల భాస్కర్, గోటికే రమేశ్, టోల్‌కట్ట సత్యనారాయణ, మర్రి రవీందర్‌రెడ్డి, గన్నెపాగ నర్సింగ్‌రావు, బాత్కు అంతయ్య, మంగలి అంతయ్య, బొర్ర సురేశ్‌గౌడ్, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, మాడి జైపాల్‌రెడ్డి, రామకృష్ణాగౌడ్, తోక రామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

**కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం**

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల నాయకులు శైలజ, సమత, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, ముధుసుధన్‌గుప్తా, టీకుపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. మండలంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు జత కలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజలు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల శ్రీను, బి.వెంకట్‌రెడ్డి, దుర్గాప్రసాద్, నర్సింలు, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చాన్‌పాషా తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

**శంకర్‌పల్లిలో..**

మండలంలోని అంతప్పగూడ, సంకేపల్లి, కొత్తపల్లి, హుసేన్‌పూర్ గ్రామాల్లో సోమవారం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే ఉన్నత భవిష్యత్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ టీవీ యాంకర్ డాలి అన్నారు. సోమవారం పట్టణంలోని భాష్యం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీవీ యాంకర్ డాలి హాజరై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దన్నారు. తమకు నచ్చిన రంగాల్లో శిక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యూసుఫ్, పాఠశాల ఇన్‌చార్జి రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.